క్లుప్తంగా

పట్టాలు ఇవ్వండి

చిల్లకూరు: తమ భూములకు పట్టాలు పంపిణీ చేయాలని కలవకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉడతా శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పేదలు అర్జీని అందజేశారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

గూడూరు: ఎన్ఈపీఈ, ఏఐపీఈయూ గ్రూప్ సీ యూనియన్ రద్దును వెంటనే విరమించుకోవాలని ఆ యూనియన్ల నాయకులు పేర్కొన్నారు. తపాలా శాఖకు సంబంధించిన పలు డిమాండ్లతో సోమవారం ఒక్క రోజు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారానికి ఈ ధర్నా చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

తడ: ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. తడకండ్రిగ అరుంధతీయవాడ సమీపంలోని పొలాల్లో పేకాట జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన తడ ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో కలసి పేకాట స్థావరాలపై దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న తడ, తడకండ్రిగకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,780 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంట ముందే ఇంటికి..

దొరవారిసత్రం: పీహెచ్‌సీలో సోమవారం విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్ ఎవరికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గంట ముందే వెళ్లిపోయింది. అదే సమయంలో ఆస్పత్రిని తనిఖీ చేసేందుకు డీపీఎంఓ శ్రీనివాసులు వస్తున్న విషయం స్థానిక వైద్యాధికారులకు తెలియడంతో హడావుడిగా అందుబాటులో ఉన్న మరో స్టాఫ్‌నర్స్ ఆస్పత్రిలో ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఈ విషయమై డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య వివరణ కోరగా విచారించి చర్యలు చేపట్టుతామన్నారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

104 సేవల తనిఖీ

దొరవారిసత్రం: కొత్తపల్లి పరిధిలో సోమవారం 104 సేవలను డీపీఎంఓ శ్రీనివాసులు ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రోగులతో మాట్లాడి ఫ్యామిలీ ఫిజియన్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా 104 సేవలు అందుతున్నాయా? లేదా అని అడిగారు. డీవీ సత్రం పీహెచ్‌సీ కూడా సందర్శించి ఓపీ, ల్యాబ్, మందుల స్టాక్ తదితర రికార్డులను పరిశీలించారు.

ఆర్ఓ ప్లాంట్‌కు భూమిపూజ



వెంకటగిరిరూరల్: మండలంలోని గుండ్లసముద్రం ఎస్టీకాలనీలో టీవీఎస్ అనుబంధంగా ఉన్న శ్రీనివాసన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మినరల్ వాటర్ ప్లాంట్, బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం వెంకటగిరి రాజ కుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర భూమి పూజ చేశారు. టీవీఎస్ ప్రతినిధి జైసింగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారావు, సెక్రటరీ రాజా, వీఆర్వో పృథ్వీరాజ్, వెంకి, పాల్గొన్నారు.

పోలేరమ్మ ఉత్సవాలు ప్రారంభం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని లోతువాని గుంట కాలనీలో ఉన్న పోలేరమ్మ ఉత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలేరమ్మ మానువద్ద గ్రామదేవతకు పూజలు చేశారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, అభిషేక పూజలను నిర్వహించారు. రాత్రి మహిళలతో సహస్ర కుంకుమార్చన పూజలు చేశారు. కాగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం రాత్రి పోలేరమ్మ మాను వద్ద రాత్రి జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

చిల్లకూరు: మండలంలోని పత్రగుంట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపుతున్నాయి. ఈ మేరకు సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. జాతీయ రహదారిపై బూదనం టోల్ ప్లాజా పక్కనే గ్రామానికి కూత వేటు దూరంలో తెలుగుగంగ కలువ పక్కన ప్రతి అమావాస్య, పౌర్ణమి సమయాల్లో క్షుద్ర పూజలు చేస్తున్నట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. ఏఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది భాస్కర్, కడివేడు, బూదనం వీఆర్వోలు బాలాజీ, భాస్కర్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షుద్ర పూజలపై నిఘా ఉంచుతామని తెలిపారు.

పథకాల అమలే లక్ష్యం

గూడూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరిరూరల్: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



వెంకటగిరి: విశేషాలంకరణలో బాబా



నాయుడుపేటటౌన్: బాబా నగరోత్సవం



రాపూరు: వెంకయ్యస్వామి ఆశ్రమంలో హోమం చేస్తున్న అర్చకులు



తడ: ప్రత్యేక అలంకరణలో బాబా

గూడూరు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున కాగడా హారతితో వేడుకలు ప్రారంభించారు. అభిషేకం, అష్టోత్తర పూజ, శ్రీవిష్ణు పారాయణం, ధునిపూజ, సత్య సాయి వ్రతం, దత్తాభిషేకం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబా పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు.

గురుపౌర్ణమి వేడుకల్లో నేదురుమల్లి

వాకాడు: సాయిబాబా మందిరంలో జరిగిన గురు పౌర్ణమి వేడుకల్లో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన బాబాకు అభిషేక పూజలు చేశారు.

తడలో ఘనంగా వేడుకలు

తడ: గురుపౌర్ణమి సందర్భంగా తడ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు విశేషాలంకరణ చేసి, భజనలు చేశారు. నిప్పో పరిశ్రమ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే చిన్న మాంబట్టులో అన్నపూర్ణ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. గంగా,అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, గోపూజ చేశారు. టీటీడీ అన్నమాచార్య వారిచే ఆలయంలో హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. తరువాత ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైభవంగా నగరోత్సవం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న సాయిబాబా మందిరంలోని బాబా చిత్రపటాన్ని ప్రత్యేకరథంపై ఉంచి, నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు రూ.6 లక్షల వ్యయంతో 120 గ్రాములు బంగారంతో నేపాల్ రుద్రాక్షలతో తయారు చేసిన బంగారుహారాన్ని బాబాకు అలంకరించారు. సామూహిక సాయి సహస్ర నామ పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్, ఉభయకర్తలు సాయిసేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్రహారపేటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేట మందిరంలో బాబా మేలుకొలుపు పూ జలతో వేడుకలను ప్రారంభించారు. భక్తుల ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం చేశారు. సాయి సహస్రనామ పూజలను జరిపారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి బాబాకు పల్లకిసేవ నిర్వహించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని కేఆర్పీ కాలనీ సమీపంలో ఉన్న సాయిబాబా మందిరం, సాయినగర్‌లోని బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయకు పాలాభిషేకం చేశారు. కేఆర్పీ సాయిబాబా మందిరంలో సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు చేసి, స్వర్ణ ప్రాకారం మండపంలో కొలువైన బాబాకు స్వర్ణ కిరీటి ధారణ చేశారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శత నామ పూజలు చేశారు. గురు చరిత్ర పారాయణం చేసి 108 లీటర్ల పాలతో శ్రీ గురు దత్తాత్రేయస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: మానమాలలోని బాబా మందిరంలో పండితులు నార్నీపాటి హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో సాయి వ్రత రుద్రాభిషేకం చేశారు. ఉదయం హారతులు, పాలు, పన్నీరు, పంచాంమృత అభిషేకాలు చేశారు. బాబా పల్లకీ సేవ జరిపారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలోని కలిచేడు, చాగణం, సైదాపురం గ్రామాల్లో ఉన్న సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రాపూరులో..

రాపూరు: షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, అభిషేకం, ప్రత్యేక పూలంగి సేవ, భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. స్థానిక వెంకయ్యస్వామి ఆశ్రమంలో మృత్యుంజయ హోమం, అభిషేకాలు, పూజలు, అన్నదానం నిర్వహించారు.



సూళ్లూరుపేటలో..



వాకాడు: పూజలు చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిలో..


వెంకటగిరి: పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్ సాయిబాబా మందిరం, కుమ్మరిమిట్ట సాయి బాబా ఆశ్రమం. ధర్మాపురం సాయిబాబా దేవస్థానం, ఎన్టీఆర్ కాలనీ, బంగారుపేట బాబా మందిరంతోపాటు కాలేజిమిట్ట శరత్‌బాబా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం బాబా గ్రామోత్సవం నిర్వహించారు.



ఓజిలి: పూజల్లో పాల్గొన్న భక్తులు



గూడూరులో..



నాయుడుపేటటౌన్‌లో..



సైదాపురంలో..

ఘనంగా మహాచండీయాగం



మహా చండీయాగం చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఆవరణలోని యాగశాలలో గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం అమ్మవారికి మహాచండీయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో అమ్మవారికి వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీ నానాజీ, నాయకులు కే జనార్దన్‌రెడ్డి, కే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పాలకమండలి సభ్యులు ఎం చంద్రశేఖర్‌రెడ్డి, వీ దినేష్‌కుమార్, ఓ బాల సత్యనారాయణ, ఎంఎం పద్మజ, ఎస్ నాగమణి, మాజీ సభ్యులు శారద, అమరావతి, ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు చర్యలు



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లెలో ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు చర్యలు తీసుకుని, ప్రజల దాహార్తి తీర్చనున్నట్లు ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. సోమవారం ఊట్లపల్లెలోని మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ నీటి సరఫరాలో లీకేజీల ఎక్కువగా ఉన్నాయని వాటిని గుర్తించి సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బాబు ప్రజలను మోసం చేశారు!



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ప్రతిపక్ష నేత చంద్రబాబు అసత్యపు హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వెంకటగిరి రూరల్ మండలంలోని చెలికంపాడు పంచాయతీలోని దాచెరువు, చెలికంపాడు దళితవాడ, గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరిస్తూ, బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. తన దృష్టికి తీసుకొచ్చిన ప్రజా సమస్యలను స్థానిక అధికారులతో చర్చించి, అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, సర్పంచ్ పీ వెంకటరమణమ్మ, సచివాలయ మండల కన్వీనర్ శ్రీనివాసులు, వెంకటగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు కే వెంకటరత్నంరాజు, శివ, కోటి, జేసీఎస్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, కే శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలయ్య, ఆవుల గిరియాదవ్, తిరుమల, వేణురెడ్డి పాల్గొన్నారు.

ఆకాష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు



ఆకాష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రసాద్

రాపూరు: ఇటీవల సైదాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యకు పాల్పడిన రాపూరు మండలం జోరేపల్లి అక్కమాంబపురానికి చెందిన వంగపాటి ఆకాష్ కుటుంబానికి అండగా ఉండి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. రాపూరు మండలం జోరేపల్లి అక్కమాంబపురంలోని ఆకాష్ తల్లితండ్రులు అంకయ్య, సుజాతను సోమవారం అధికారులతో కలసి ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆకాష్ కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఆకాష్ మృతికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా మృతుని కుటుంబానికి అందాల్సిన నష్టపరిహారం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నెల్లూరు ఆర్డీఓ మలోల,సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, డీఎస్పీలు కోటారెడ్డి, వెంకటరమణ, తహసీల్దార్ సుభాషిణి, ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి ఉన్నారు.

చోరీ కేసులో 12 మంది అరెస్టు

తడ: మండలంలోని మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో అల్యూమినియం కడ్డీలు చోరీ కేసులో 12 మందిని అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తడ ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మాంబట్టు సెజ్ పరిధిలోని పరిశ్రమ స్టోర్ రూమ్‌లో ఉంచిన రూ.3.80 లక్షల విలువైన 2 టన్నుల అల్యూమినియం కడ్డీలు జూన్ 26వ తేదీన చోరీ విషయమై ఆ పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ కే సుమన్ ఆదివారం తడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్, సిబ్బంది కొండూరుకు చెందిన ఓ అనుమానితుడిని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది. చోరీలో పరిశ్రమలో పని చేసే కాదలూరు పంచాయతీ కట్టవ గ్రామానికి చెందిన శ్రీనివాసులుతోపాటు బురదమడుగు, వత్రపాళెం, కొండూరు ప్రాంతాలకు చెందిన 12 మంది ప్రమేయం ఉండడంతో వారిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



తనుజా, శివారెడ్డిలను సన్మానిస్తున్న ప్రకాశం జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, ఎంపీపీలు

వెంకటగిరిరూరల్: ఎంపీపీల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన వెంకటగిరి ఎంపీపీ తంబిరెడ్డి తనుజా, శివారెడ్డిని ఎంపీపీ సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వాకా వెంకటరెడ్డి, ప్రకాశం జిల్లా ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి దొనకొండ ఎంపీపీ ఉషామురళీకృష్ణ, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డిలు సోమవారం వెంకటగిరిలోని ఎంపీపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువతో సన్మానించారు.

జగనన్న రాజ్యం మళ్లీ కావాలి



నెలబల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్న రాజ్యం మళ్లీ కావాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం నెలబల్లి, భీమవరం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికం తొలగించి అభివృద్ధి సాధించడానికి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం నెలబల్లి దళితకాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఎన్ ప్రిస్కిల్లా, పార్టీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు గోవిందురెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రఘునాయుడు, రమణారెడ్డి, గోపాలయ్య, జితేంద్ర, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మాతమ్మ కొలుపు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని అలిమిలిలో జరుగుతున్న మాతమ్మ కొలుపు ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం అర్ధరాత్రి వరకు సాగింది.

పథకాలతో ముస్లిం జీవితాల్లో వెలుగులు



రసూల్‌ను సత్కరిస్తున్న యస్థానీబాషా

వెంకటగిరి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ముస్లిల కోసం అమలు చేసిన పథకాలతో నిరుపేద ముస్లింల జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు షేక్ మహ్మమద్ రసూల్ తెలిపారు. స్థానిక జామియా మసీదులో సోమవారం హర్ దిల్‌మే వైఎస్సార్, హం సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు ద్వారా ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు ముస్లింలకు దక్కాయన్నారు. మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యస్థానీబాషా మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ తమ గుండెల్లో కొలువై ఉన్నారని ముస్లింలు సగర్వంగా చెబుతారని తెలిపారు. అనంతరం షేక్ మహ్మదర్‌రసూల్‌ను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్ షఫీ అహ్మద్, ఖాదరి, పఠాన్ షాన్ ఖాన్,జఫ్రుల్లా, కాలేషా,మునీర్ ,రఫీ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ తాజుద్దీన్ ఇస్మాయిల్ పఠాని, ఇస్మాయిల్ అహ్మద్ బాషా, ఖాజాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక సురక్ష



నాయుడుపేటటౌన్: మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక అని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం వలంటీర్లుకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ నాయుడుపేట అర్బన్ కన్వీనర్ చదలవాడ కుమార్, దారా రవి, ఎంఎల్ఓ షరీఫ్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కే మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి జగనన్న సురక్ష

గూడూరురూరల్: మండలంలో ఈనెల 5 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 5వ తేదీ కొండాగుంట, 7న రామలింగాపురం, 11న చెన్నూరు–1, 13న మేకనూరు, 15న వెండోడు, 18న మిట్టాత్మకూరు, 20న నెర్నూరు, 22న విందూరు, 25న కొమ్మనేటూరు, 27వ తేదీన పాలిచెర్ల సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

ఓజిలి: అర్హులైన ప్రతిపేదవానికి సంక్షేమ పథకాలు అందాలని ప్రత్యేక అధికారి కే సుమన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పీ మానికారెడ్డి, ఏ గోపాలయ్య, ఏఎంసీ డైరెక్టర్ పీ ప్రవీణ, సచివాలయ కన్వీనర్ ఈ చినపెంచలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొట్టు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

రాపూరు: మండలంలో శానాయిపాళెం, సంక్రాంతిపల్లె గ్రామాల్లో మంగళవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొననున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు.

ప్రజలకు వరం

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని జేసీఎస్ కన్వీనర్ ఎం రవికుమార్ అన్నారు. సైదాపురం సచివాలయం –1లో సోమవారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గృహ సారథులు, వలంటీర్లు, అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఏఓ హైమావతి, కార్యదర్శులు శశిఇంద్రాణి, వంశీ, ఉపసర్పంచ్ శివకుమార్ పాల్గొన్నారు.